ప్రజాశక్తి
బుధవారం 01 జనవరి 2025 5 కర్నూలు





కర్నూలులో పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

'నూతన' ఆశలతో...

- కొత్త సంవత్సరంలోకి అడుగులు... - లక్ష్యాలతో ముందుకెళ్తేనే ప్రయోజనం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

2024 సంవత్సరంలో మనసు పిండేసే చేదు అనుభవాలు.. హృదయంలో దాచుకునే మధుర జ్ఞాపకాలు.. మరిచిపోలేని తీపి గుర్తులు నెమరు వేసుకుంటుండగా చిన్నముల్లు, పెద్ద ముల్లు 12 వద్దకు చేరాయి. ఒక సంవత్సరం కాలగర్భంలో కలిసిపోయింది. నూతన సంవత్సరం ప్రారంభమైంది.. ఒక్కసారిగా హ్యాపీ న్యూ ఇయర్ అనే అరుపులు అంబరాన్ని అంటాయి. అందరి చేతులు కలిశాయి. శుభాకాంక్షలు చెప్పకున్నారు. తారా జువ్వలు ఆకాశంలో తళకులీనాయి. కేక్ కటింగులు, చిన్నా పెద్దల చిందులతో, ఉరకలెత్తే ఉత్సాహంతో, యువత కేరింతలతో, క్రైస్తవులు ప్రార్థనలతో 2025కు స్వాగతం పలికారు. కొంగొత్త ఆశలతో మొదలవనున్న కొత్త ఏడాదిలో లక్ష్యాలతో ముందుకెళ్తేనే ఫలితం సాధ్యమవుతుంది.....



నూతన సంవత్సర కొత్త ఉత్సాహంతో జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. కోటి ఆశలతో ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మంగళవారం రాత్రి 7 గంటల నుంచే న్యూ ఇయర్ సందడి మొదలైంది. నగరంలోని చర్చిలు దీప కాంతులు నడుమ మెరిసిపోయాయి. దైవ సన్నిధిలో క్రైస్తవులు న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలు కాగానే ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వైన్ షాపుల వద్ద ఎక్కువ సంఖ్యలోనే కొనుగోలుదారులు దర్శనమిచ్చారు. రోడ్లపై యువత కేరింతలు కొడుతూ తిరిగారు.

జోరుగా కేకుల అమ్మకాలు

కర్నూలు, నంద్యాల నగరాలతో పాటు అన్ని పట్టణాల్లో మంగళవారం ఉదయం నుంచే కేకుల అమ్మకాలు జోరుగా సాగాయి. రోడ్ల పక్కన, దుకాణాల ముందు ప్రత్యేక షామినాయాలు వేసి కేకులను విక్రయించారు. కేజీ సాధారణ కేకు రూ.200 నుంచి రూ.250 వరకూ, కేజీ కూల్ కేకు రూ.500 వరకూ విక్రయించారు. పలు ప్రాంతాల్లో కేజి కేకు కొంటే కూల్‌డ్రింక్ ఉచితంగా ఇస్తామంటూ ఆఫర్లు ప్రకటించారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా. ఈ ఏడాది ప్రధాన ప్రాంతాల్లో బిర్యానీలను కూడా విక్రయించారు.

నూతన లక్ష్యాలు ఉండాలిలా...

ఒక్కసారి గడిచిన ఏడాదిని సమీక్షించుకున్న తర్వాత ఈ ఏడాదిలో ఆశిస్తున్న మార్పు గురించి స్పష్టత సాధించాలి. ఆలోచనలను నిర్దిష్టమైన లక్షాలుగా మార్చుకోవాలి. ఒకచోట రాసుకోవాలి. ఒక్కటే పెద్ద లక్ష్యం పెట్టుకోవడం కన్నా కొన్ని వేర్వేరు లక్ష్యాలను పెట్టకోవడం ప్రయోజనకరం.

ఆర్థిక లక్ష్యాలు : నెలవారీ ఆదాయం పెంచుకోవడం, పొదుపు చేయడం, ఒక కొత్త ఆస్తిని ఏర్పాటు చేసుకోవడం అందరికీ మంచిది.

నైపుణ్య లక్ష్యాలు : ఉద్యోగులు తమ ఉద్యోగాల్లో కొత్త నైపుణ్యాలు సాధించడం, విద్యార్థులు కొత్త కోర్సులు చేయడం.

మానసిక లక్ష్యాలు : ఒక చెడు అలవాటును మార్చుకోవడం (స్మోకింగ్, మద్యం, గుట్కా, మత్తు మందులు, పేకాట వంటివి), ఒక మంచి అలవాటు చేసుకోవడం (వాకింగ్, వ్యాయామం, పుస్తక పఠనం వంటివి).

వృత్తి లక్ష్యాలు : ఇంక్రిమెంట్లు సాధించడం, ప్రమోషన్లు సాధించడం ఇలా వేర్వేలు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల జీవన శైలి మారుతుంది. వ్యక్తిగతంగా మారితే సమాజం మారుతుంది. కాబట్టి మనం పలు లక్ష్యాలు ఈ కొత్త సంవత్సరంలో పెట్టుకుందాం. దానికి తగ్గ ప్రయత్నం చేసి ఫలితాలను సాధిద్దాం...

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

- కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ కమిటీలు సమర్థవంతంగా పని చేయాలన్నారు. మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీలు చురుగ్గా పని చేయాలన్నారు. నూతనంగా గుర్తించిన ఇసుక రీచ్‌లు హోళగుంద మండలం ముద్దటమాగి, నందవరం మండలంలోని నాగులదిన్నె, గంగవరం పర్యావరణ అనుమతులు మంజూరు చేశామని, నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఇసుక రీచ్‌లలో సిసి కెమెరాలు పూర్తి స్థాయిలో ఎల్లప్పుడూ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని గనుల శాఖ అధికారిని ఆదేశించారు. గనుల శాఖ అధికారి రవిచంద్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, భూగర్భ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, టౌన్ డిఎస్‌పి బాబు ప్రసాద్, డిటిసి శాంతకుమారి, తుంగభద్ర దిగువ కాలువ ఇఇ శైలేశ్వర్ పాల్గొన్నారు.

రూ.102.83 కోట్ల పింఛన్ పంపిణీ

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జిల్లాలో అర్హులైన 2.30 లక్షల మంది పెన్షన్ లబ్దిదారులకు రూ.102.83 కోట్లు పంపిణీ చేశామనిజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. జొహరాపురం రోడ్డు లక్ష్మీ గార్డెన్స్ లోని పూల సుబ్బయ్య నగర్‌లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పథకం కింద లక్ష్మీదేవికి వికలాంగ పింఛన్,రామలక్ష్మికి వితంతువు పింఛన్ నాగమణికి ఒంటరి మహిళా పింఛన్ వారి ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్ అందజేశారు. అనంతరం కాలనీలో నీటి సమస్య ఏమైనా ఉందా? అని కలెక్టర్ కాలనీవాసులను ఆరా తీశారు. తాగునీరు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వస్తున్నాయని, నీరు చిన్నగా రావడం వల్ల, నీరు సరిపోవడం లేదని కాలనీవాసులు కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. తాగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. తాగునీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని కలెక్టర్ సెక్రటరీని ఆదేశించారు. తాగు నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కాలనీలో కమ్యూనిటీ టాయిలెట్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, డిఆర్‌డిఎ పిడి శివ నాగలీల తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలు వాయిదా

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి అనంతరం జనవరి ఒకటో తేదీవరకు సంతాప దినాలు ఉన్నందున 2025 నూతన సంవత్సర వేడుకలకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష వాయిదా వేశారు. ఒకటో తేదిన కలవాల్సి వారంగా ఈనెల 2న కలవాలని అందరి అధికారులకు సూచించారు. ఏ అధికారి తనకు ఒకటో తారీఖు కలవద్దని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం నాడు కలెక్టర్ ఛాంబర్‌కు వచ్చి శుభాకాంక్షలు తెలపాలని సూచించారు.

రూ.కోట్లు ఖర్చు చేసి

పశువుల పాకలా మార్చారు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

పాత బస్టాండ్‌లో కొండారెడ్డి బురుజు ఎదుట కోట్లు ఖర్చు చేసి చిన్న చిన్న పార్కులతో పాటు వివిధ రకాల అందమైన కట్టడాలు కట్టి నిర్వహణ గాలికి వదిలేసారని సమీప కాలనీల ప్రతినిధులు ఎ.నాగరాజు,ఎం. హనుమంత రెడ్డి, ఎస్.సర్దార్‌బాష ఆవేదన వ్యక్తం చేశారు. పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం స్థానికులతో కలిసి ఆ ప్రాంతంలో మంగళవారం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందమైన కట్టడాలు నిర్మించిన అధికారులు నిర్వహణ గాలికి వదిలేయడంతో పశువుల పాకలా మారిందన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం.నాగరాజు మాట్లాడుతూ కళాకారులకు ఉపయోగపడే ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను కూలగొట్టి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రూ.కోట్లు ఖర్చు చేశారని అన్నారు. ఏడాది తిరగకముందే అందులో కొన్ని కట్టడాలు, విద్యుత్ పరికరాలు శిథిలమవుతున్నాయని తెలిపారు. ఖరీదైన మొక్కలు, పచ్చిగడ్డి నీళ్ల పోసేదిక్కు లేక ఎండిపోతున్నా.. సంబంధిత అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. కలెక్టర్ జోక్యం చేసుకొని ఈ ప్రాంతం నిర్వహణ, నాసిరకం పనులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏ.వెంకటేశ్వర్లు, ఎస్. ఆర్ .గౌడు, ఎండి. యూనూస్, ఎస్. అన్వర్ భాష, శ్రీరామ్,షాకీర్, జీవన్ ఖాన్, గులాబ్ భాష పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న నాయకులు

జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఎం పోరాటం

- సిపిఎం జిల్లా నూతన కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం, వలసలు ఆపడం కోసం, యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమల నిర్మాణం కోసం రాబోయే కాలంలో పోరాటాలను ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ తెలిపారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనం సిపిఎం జిల్లా కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సిపిఎం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, కార్యదర్శివర్గ సభ్యులు జి.రామకృష్ణ, పిఎస్.రాధాకృష్ణ, ఎండి.అంజిబాబు, టి.రాముడు కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో సిపిఎం 23వ జిల్లా మహాసభలు 29, 30 తేదీలలో నిర్వహించామని చెప్పారు. నూతన కార్యదర్శిగా డి .గౌస్ దేశాయ్, కార్యదర్శివర్గ సభ్యులుగా పి.నిర్మల, పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కెవి.నారాయణ, వెంకటేశ్వర్లు, ఎండి.అంజిబాబు. టి.రాముడు, ఎండి.ఆనంద్ బాబు 9 మందితో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నామన్నారు. 26 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. ఈ మహా సభకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, వి. వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ మహాసభలో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం రూ.10వేల కోట్ల నిధులు కేటాయించాలని, జిల్లాలో ప్రాజెక్టులను నిర్మించి వలసలను ఆపాలని, జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు 75 శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, కర్నూలు ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, జిల్లాలో రైల్వేలను అభివృద్ధి చేయాలని, కర్నూలు నుండి అమరావతికి ఇంటర్సిటీ రైలు నడపాలని, మంత్రాలయం నుండి శ్రీశైలం, కర్నూలు నుండి నంద్యాల వరకు కొత్త రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని, కర్నూలు ఆదోని ఎమ్మిగనూరు పట్టణాలలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించాలని, మహిళలపై జరుగుతున్న దాడులు హత్యలు అత్యాచారాలు అరికట్టాలని, దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, అసంఘటిత కార్మికులకు సమగ్రమైన చట్టం చేయాలని, వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి ప్రజలకు ఆర్థిక సహకారాన్ని అందించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజలపై వేస్తున్న ధరలు, పన్నుల బారాలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. ఈ తీర్మానాల అమలు కోసం పాలకులపై వత్తిడి తెస్తామని చెప్పారు. జిల్లా సమగ్ర అభివద్ధి కోసం, ప్రజలపై వేస్తున్న బారాలకు వ్యతిరేకంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలకు నూతనంగా ఎన్నికైన కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. సిపిఎం రాబోయే కాలంలో చేసే పోరాటాలకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ఎంపి బైరెడ్డి శబరిని కలిసిన కమిషనర్

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్: నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరిని కర్నూలు నగరం ఆటోనగర్‌లోని ఆమె నివాసంలో మంగళవారం నగరపాలక కమిషనర్ ఎస్ .రవీంద్ర బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి కమిషనర్ పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కల్లూరు అర్బన్‌కు సంబంధించి పలు సమస్యలపై చర్చించారు.



పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం శివరాంపురం గ్రామంలో కోడుమూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో పాల్గొని వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



ఉద్యోగ విరమణ సర్వ సాధారణం

విసి సాయి గోపాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది సర్వ సాధారణమని క్లస్టర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డివిఆర్ సాయి గోపాల్ అన్నారు. క్లస్టర్ విశ్వవిద్యాలయం, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో గణిత శాఖ అధ్యక్షులు, బాలుర వసతి గృహ డిప్యూటీ వార్డెన్ టి చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ సన్మాన సభ మంగళవారం ఘనంగా నిర్వహించారు. విసి ఆచార్య డివిఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అంటే ఒత్తిడి లేని జీవితమని అన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్‌వివి.సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షత వహించారు.

ఇంటి పన్ను కడతావా...పింఛన్‌లో పట్టుకోవాలా ..!?

కొండాపురంలో కార్యదర్శి తిరకాసు

ప్రజాశక్తి- సి బెళగల్

ఇంటి పన్ను, కొళాయి పన్ను, ఖాళీ స్థలం పన్ను, భూమి పన్ను కట్టాలంటే, కట్టించుకోవాలంటే ఏడాదికి ఒక మారు కట్టి రసీదులు పొందాల్సిందే....అదే సి.బెళగల్ మండలం కొండాపురంలో ఏడాది కూడా పూర్తి కాకుండానే పంచాయతీ కార్యదర్శి రాజేష్ మాత్రం పింఛన్ పంపిణిలోనే వ్యవహరించిన తీరు చర్చనీయాంశమైంది. ఇంటి పన్ను కడతావా లేదా? పెన్షన్ డబ్బులో జమ చేసుకోవాలా అంటూ ప్రజలను కొంతసేపు ఇబ్బంది పెట్టారు. అందరూ అలానే కట్టారు..అక్కడి ప్రజలు కొందరు మాత్రం ఏడాది గడువు ఇంకా పూర్తి కాలేదని రసీదులు తెచ్చి కార్యదర్శికి చూపించారు. అదంతా నాకు తెలియదు. నేను చెప్పిందే గడువు...మీరు కట్టాల్సిందే తడవుగా అన్నట్లుగా మాట్లాడి లేదంటే మీ గ్రామానికి ఏ పథకాలు రానివ్వనని బెదిరింపులకు పాల్పడినట్లు బాధితులు చెప్పారు. ఇలాగైతే ప్రభుత్వ లక్ష్యం నెరవేరేదేట్లా అంటూ ఆ గ్రామంలో నాయకులు, పెద్దలు , కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరణ, జనన ధ్రువ పత్రాలకు భారీగా డిమాండ్ చేస్తూ జేబులు నింపుకుంటున్నట్లు సమాచారం. అంతేకాకుండా ఇదే కొండాపురం పంచాయతీలో వివిధ రకాల పంచాయతీ నిధులను పక్కదారి మళ్లించారని, సర్పంచికి కూడా ఎలాంటి లెక్కలు రావని విధుల్లో ఇష్టరాజ్యమైనట్లు తెలుస్తోంది. ఈ విషయం ఎంపిడిఒ రానెమ్మకు తెలియడంతో క్రమశిక్షణ చర్యలు చేడతామని అవసరమైతే బదిలీ చేయిస్తామని మీడియాతో చెప్పారు. ఏది ఏమైనా ఈ కార్యదర్శి అక్రమ వసూళ్ల,క్రమ శిక్షణ రాహిత్యం వంటివే కాకుండా వివిధ రకాల పన్నుల వసూళ్లలో రసీదులు ఇవ్వడం లేదని పలువురు చెబుతున్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నూతన సంవత్సరం సందర్భంగా నగరపాలక పారిశుధ్య ఇంజనీరింగ్ విభాగాల రెగ్యులర్ కార్మిక సిబ్బందికి మూడు జతల వస్త్రాలు, మూడు టవాళ్ళు, 2 జతల చెప్పులను కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పంపిణీ చేశారు. మంగళవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని శానిటేషన్ డివిజన్ కార్యాలయంలో పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల అభ్యున్నతికి నగరపాలక సంస్థ ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగా ప్రతీ ఏడాది కార్మికులకు వస్త్రాలు, టవళ్లు, చెప్పులు తదితర వాటిని పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్‌రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యుడు యూనూస్, కార్పొరేటర్లు పరమేష్, ఫరాజ్ ఖాన్ పాల్గొన్నారు.



సంపూర్ణ ఆరోగ్యం పై అవగాహన పెంచాలి

మాతా శిశు మరణాలను తగ్గించాలి -డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సంపూర్ణ ఆరోగ్యం పై ప్రజల్లో అవగాహన పెంచాలని మాతా శిశు మరణాలను తగ్గించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి తన ఛాంబర్ లో జిల్లా ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో పట్టణ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అందించే వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ ఏ స్త్రీ జన్మనిస్తూ మరణించకూడదని, ఏ శిశువు మరణించడానికే జన్మించకూడదు అని తెలిపారు. మాతా శిశు సంక్షేమం విషయంలో పకడ్బందీ ప్రణాళిక అమలుచేస్తూ మాతా శిశు మరణాలను తగ్గించవచ్చునని సూచించారు. వైద్య ఆరోగ్య సేవలలో ప్రజలలో సంతృప్తి స్థాయి పెరగాలని కోరారు. దీనిపై దృష్టి పెట్టుకొని వైద్య సేవలు , ఇతర కార్యక్రమాల వివరాలు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు .గర్భవతిగా నమోదు చేసుకున్న తరువాత రక్త హీనత, మూత్ర పరీక్షలతో పాటు థైరాయిడ్, హెచ్ఐవి, సిఫిలిస్ ఇతర సుఖ వ్యాధులు పరీక్షలు చేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలైన 108, 104, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్, పట్టణ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో లభించు సేవలపై, టిబి, ఎయిడ్స్, లెప్రసీ , కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యు, మెదడువాపు, చికూన్ గున్యా, కలుషిత నీటి ద్వారా అతిసారం, టైఫాయిడ్, కామెర్లు గాలి ద్వారా టిబి , అసంక్రమిత వ్యాధులు రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, పక్షవాతం, గుండెపోటు వీటన్నిటిపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎ టిఒ డాక్టర్ భాస్కర్ , డిఐఒ డాక్టర్ నాగప్రసాద్, డిబిసి ఎస్.డాక్టర్ సంధ్య, పిఒఆర్‌బిఎస్ కె హేమలత, డిసిఎన్‌టిఆర్ వైద్య సేవ డాక్టర్ భాస్కర్ రెడ్డి, డిఎంఒ నూకరాజు, డెమో శ్రీనివాసులు, ఎస్ హేమసుందరం, డిపిఒ విజయరాజు, ఎపిడమాలజిస్ట్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ


రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు కోరారు. కర్నూలు రూరల్ మండలం పంచ లింగాల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు లో ఆయన పాల్గొన్నారు.. కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలను త్వరగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపి ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు భూ సమస్యల పరిష్కారాలకు చక్కటి వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు.కర్నూలు రూరల్ ఇంచార్జి తహశీల్దార్ వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి బస్తిపాటి నాగరాజు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ ఉద్యోగులు

వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం ఎన్నిక

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి కర్నూలు అగ్రికల్చర్

వ్యవసాయ శాఖ కర్నూలు , నంద్యాల జిల్లాలో అనగా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖలో పరిపాలన అధికారి నుండి ఆఫీసు సబార్డినేట్ వరకు విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఉద్యోగులందరికీ కర్నూల్ జిల్లా ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం నాయకులు సమక్షంలో మంగళవారం సాయంత్రం నగరంలోని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో(ఎపిజిఇఎ)లో వ్యవసాయ ఉద్యోగుల సమావేశం ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఎన్నికల కు రాష్ట్ర సహా అధ్యక్షులు వి.రఘురామ నాయుడు, రాష్ట్ర కోశాధికారి దొగురు శ్రీహరి, ఉపాధ్యక్షులు బి.సురేంద్ర, కడప జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రసాదు గౌడ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖలో వున్న ప్రధాన సమస్యలపై చర్చించారు. అనంతరం వ్యవసాయ శాఖ రాష్ట్ర నాయకుల సమక్షంలో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశానికి వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరు హాజరయ్యారు. ఈ నూతన కార్యవర్గంపై పలువురు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తదుపరి ఎన్నికయిన నూతన కార్యవర్గం సభ్యులందరు కర్నూలు జిల్లా జిల్లా వ్యవసాయ అధికారిని పిఎల్. వరలక్ష్మి ని కలిసి టేబుల్ క్యాలండర్ ఆవిష్కరించారు.

ప్రభుత్వ విద్యా పరిరక్షణకు కృషి

- ప్రజా వైద్యులు డాక్టర్ మాలకొండయ్య



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ పాఠశాల విద్యా పరిరక్షణకు ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలని ప్రజా వైద్యులు డాక్టర్ మాలకొండయ్య కోరారు. మంగళవారం యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ప్రజా వైద్యులు డాక్టర్ మాలకొండయ్య, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి యుటిఎఫ్ డైరీ, అధ్యాపక దర్శిని, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ... యుటిఎఫ్ డైరీ, అధ్యాపకదర్శిని ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎన్నో సందేహాలను నివృత్తి చేస్తుందని, సమస్యల పరిష్కారానికి దిక్సూచి లాంటిదని తెలిపారు. ఉపాధ్యాయుల సర్వీసుకు సంబంధించి అనేక విషయాలు వీటిలో పొందుపరిచారని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి మాట్లాడుతూ... నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు క్రమశిక్షణ రహితంగా తయారవుతున్నారని, ఇది సమాజ పతనానికి దారి తీస్తుందని తెలిపారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని సూచించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమణి, జిల్లా కార్యదర్శులు గుమ్మల బాబు, కౌలన్న, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప, నాయకులు మద్రి రాజు, వై.రామాంజనేయులు, చంద్రపాల్, శివ కుమార్, లక్ష్మన్న, పెద్దారెడ్డి, గురు స్వామి, మల్లారి నాగరాజు, భీమేష్, భాగ్యరాజు, దేవపాల్, నరసింహులు, శంకరయ్య, నారాయణ, బి.రామాంజనేయులు, మాదన్న, రాఘవేంద్ర, చౌడయ్య, రవి, శాంతన్న పాల్గొన్నారు.

మాదాసి కురువలకు

ఎస్సీ సర్టిఫికెట్లను రద్దు చేయాలి

- కెవిపిఎస్, జైభీమ్ ఎంఆర్‌పిఎస్ నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లను రద్దు చేయాలని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి రత్నం, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు నేపాల్ కోరారు. మంగళవారం మండలంలోని చిలకలడోన గ్రామంలో విఆర్‌ఒ ప్రభాకర్‌కు ఎస్సీ కుల గణనపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డిసెంబర్ 26న ప్రదర్శించిన కులగణన జాబితాలో అనేక తప్పులు ఉన్నాయని చెప్పారు. దాసరి కులస్తులను ఎస్సీ కులగణన జాబితాల నుంచి తొలగించి అసలైన దళితులకు న్యాయం చేసి వారి ఎస్సీ రిజర్వేషన్లను అలాగే కొనసాగించాలని సూచించారు. ఎస్సీ కులగణనపై సమయం కూడా పొడిగించాలని కోరారు. కెవిపిఎస్ నాయకులు లక్ష్మన్న, డేవిడ్, ప్రకాశం, తిక్కయ్య, హనుమంతు, బాలు, ఏసేబు, రామన్న, మోజేష్, స్టీఫెన్, పౌలు, ప్రభాకర్, బుడ్డ తిమ్మన్న, రంగన్న, మహానంది, ప్యాపిలయ్య, అనోకు పాల్గొన్నారు.

సహకార సంఘం స్థలాలను పరిరక్షిస్తాం

- రైతులకు ఉపయోగపడే వేర్ హౌస్ నిర్మాణానికి ప్రతిపాదనలు

- డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఉమాదేవి



సహకార సంఘం స్థలాలను పరిశీలిస్తున్న ఉమాదేవి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆదోని డివిజన్‌లో సహకార సంఘాల ఆధీనంలో ఉన్న స్థలాలను పర్యవేక్షించి, ఆ స్థలాల్లో రైతులకు ఉపయోగపడే వేర్‌హౌస్ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఉమాదేవి తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు సహకార సంఘం ప్రత్యేకాధికారి రామరాజు, బెల్డోన సహకార సంఘం సిఇఒ హరికృష్ణ ఆధ్వర్యంలో నేమకల్లు గ్రామంలో ఉన్న సహకార సంఘం గోడౌన్‌ను, ఖాళీ స్థలాన్ని పరిశీలించి కొలతలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సహకార సంఘాల ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాలను ఎవరు ఆక్రమించినా చట్ట నేరమన్నారు. స్థలాలను ఆక్రమించిన వారిపై కోర్టు ద్వారా నోటీసులు ఇప్పించి చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఖాళీ స్థలాల్లో రైతు పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడానికి వేర్‌హౌస్ భవనాలను నిర్మిస్తామన్నారు. సర్పంచి ప్రేమ్ కుమార్, సొసైటీ జూనియర్ అసిస్టెంట్లు శ్రీకాంత్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, సిపిఎం జిల్లా నాయకులు సి.గోవిందు, సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) తాలూకా నాయకులు రాజు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం వామపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంబేద్కర్‌ను కించపరచడం ద్వారా బిజెపి నిజస్వరూపం, ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశం తేట తెల్లమైందని విమర్శించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజే దాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఆర్‌ఎస్‌ఎస్ ప్రకటించడం దాన్ని బరితెగింపునకు నిదర్శనమని మండిపడ్డారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చుతామని బిజెపి ప్రచారం చేసిందని, ప్రజలు 240 సీట్లకే పరిమిత చేయడంతో టిడిపి, జెడియులపై ఆధారపడి అధికారంలోకి వచ్చారని తెలిపారు. చంద్రబాబు, నితీష్ కుమార్ మద్దతు ఉపసంహరించుకుంటే ఎన్‌డిఎ ప్రభుత్వం కుప్పకూలి పోతుందని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కూల్చడమే లక్ష్యంగా బిజెపి పని చేస్తోందని, అందులో భాగంగానే జమిలి ఎన్నికలు తీసుకు రాబోతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా నిరసనను వెల్లువెత్తుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్మోహన్ రెడ్డి నోరెత్తడం లేదని విమర్శించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్ల తాను ప్రధానమంత్రి కాగలిగానని చెప్పిన మోడీ అంబేద్కర్‌ను కించపరిచిన అమిత్ షాను సమర్థించడం ఏమిటని ప్రశ్నించారు. అంబేద్కర్‌ను విమర్శించిన అమిత్ షా భారత ప్రజానీకానికి క్షమాపణలు చెప్పి, బేషరతుగా మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. వామపక్ష నాయకులు కెసి.జబ్బార్, రాముడు, ప్రసాద్, లక్ష్మీ నరసయ్య, దాదావలీ, సమీవుల్లా, విజయేంద్ర, సురేష్, శాంతిరాజు, ఆంథోని, నల్లన్న, తిమ్మగురుడు, నరసింహులు, మల్లికార్జున గౌడ్, రామాంజనేయులు, ఖాజా, ఇస్మాయిల్, నాగరాజు పాల్గొన్నారు.



వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఖాదర్ లింగస్వామి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి 405వ జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం మత సామరస్యానికి ప్రతీకగా వెలిసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో శిష్య బృందం ఆధ్వర్యంలో స్వామి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో భక్తుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గా ధర్మకర్త మున్నా బాషా సాహెబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గాలో రాత్రి భయాన్ కార్యక్రమం, అనంతరం ఖావాలి కార్యక్రమాన్ని భక్తులు ఎంతో ఆసక్తితో తిలకించారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న శిష్యులు

ప్రభుత్వ విద్యా బలోపేతానికి పోరాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రవి

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రభుత్వ విద్యా బలోపేతానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు వినోద్ తెలిపారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ సంఘం జిల్లా నాయకులు రవి జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, హాస్టల్ మెస్ చార్జీలు పెంచాలని కోరారు. మెడికల్ కళాశాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి అడ్మిషన్లు ప్రారంభించాలని, జిఒ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు తరుణ్, మహేష్ పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు రవి

పేదల సంక్షేమం ముఖ్యమంత్రి బాబు లక్ష్యం


- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని, కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్లను ఇంటి వద్దకెళ్లి పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 12వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. వార్డులో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆ వార్డులో ఉన్న పాఠశాల అభివృద్ధికి ఎంఇఒకు సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తు విద్యార్థులు నూతన సంవత్సర శుభాకాంక్షలు ముందుగా తెలిపారు. విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని వార్డు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఇదే వార్డులో నిరుపేద కుటుంబంలో జరుగుతున్న వివాహానికి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ఆర్థిక సహాయం అందించారు. ఆయన మాట్లాడుతూ... సమాజంలో అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో వెలుగు నింపడమే లక్ష్యం


ఆదోని : పేదల కళ్లల్లో వెలుగు నింపాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని, 1వ తేదీ ముందే పింఛను ఇస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సూచన మేరకు 26వ వార్డు, వెంకన్న పేటలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనవరి కొత్త సంవత్సరం 1వ తేదీ ఇవ్వాల్సిన పింఛను ముందుగానే పంపిణీ చేసినట్లు తెలిపారు. పింఛనుదారుల ఆనందమే ప్రభుత్వ లక్ష్యమని, వారు ఎటువంటి ఇబ్బందులు పడకుండా నేరుగా ఇళ్లకు వెళ్లి తెల్లవారుజాము నుంచి అందజేసినట్లు చెప్పారు. విజన్ ఉన్న నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు. బసాపురం రామస్వామి, రంగస్వామి నాయుడు, వార్డు ఇన్‌ఛార్జీ మల్లికార్జున, వార్డు వెల్ఫేర్ సెక్రటరీ అమరేష్ ఉన్నారు.




ఎమ్మిగనూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

విజన్ గల నాయకులు చంద్రబాబు

అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఆలోచించే విజన్ గల నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. మండిగిరిలో టిడిపి నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కొత్త సంవత్సరం నేపథ్యంలో జనవరి 1కి ముందే పేదల ఇళ్లల్లో పింఛను డబ్బు ఉండాలని, ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. మురళీ, బాబురావు, నాగేంద్ర, ఉలిగప్ప, రేవన్ కుమార్, నాయుడు, లక్ష్మీకాంత్ రెడ్డి, సోమారెడ్డి, పరమేష్, పెద్ద ఈరన్న, నరసింహులు ఉన్నారు. **నందవరం** మండలం ముగతి గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్‌ను టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్, ముగతి గ్రామ అధ్యక్షులు ముగతి భార్గవ్ యాదవ్ లబ్ధిదారులకు అందజేశారు. వికలాంగులు, వృద్ధులకు ఒకరోజు ముందే పింఛను పంపిణీ చేయడం వల్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. చిన్న రంగన్న, కడబూర్ అర్జున్, వెలుగు సిసి చెన్నమ్మ, గ్రామ సచివాలయ అధికారులు నాగరాజు, విష్ణువర్ధన్ రెడ్డి, విఎఒ వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.



పింఛను పంపిణీ చేస్తున్న ఉమాపతి నాయుడు



పంపిణీ చేస్తున్న కృష్ణమ్మ



నందవరంలో పింఛను పంపిణీ చేస్తున్న నాయకులు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీవీ

అంతర్ రాష్ట్ర వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా అంతర్ రాష్ట్ర వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర నేపథ్యంలో నిర్వహించే మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి మెమోరియల్ అంతర్ రాష్ట్ర వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన గోడపత్రికను ఎమ్మెల్యే బీవీ చేతులమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో ఆటల కోలాహలం మొదలైందని తెలిపారు. క్రీడలు మానసికోల్లాసాన్ని తోడ్పడతాయని చెప్పారు. ఈ పోటీలు ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.40 వేలతో పాటు షీల్డ్, రెండో బహుమతి రూ.30 వేలతోపాటు షీల్డ్, మూడో బహుమతి రూ.20 వేలతో పాటు షీల్డ్, నాలుగో బహుమతి రూ.10 వేలతో పాటు షీల్డ్ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతాయని తెలిపారు. వాలీబాల్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు బందే నవాజ్, రాజేష్, మల్లి, కురువ వీరేష్, శేషాద్రి, అంబయ్య, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఒగా ప్రమోషన్ పొందిన

బాల మురళీ కృష్ణకు సన్మానం



సన్మానం చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆదోని

డిఎంహెచ్‌ఒగా ప్రమోషన్ పొందిన డాక్టర్ బాల మురళీ కృష్ణను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఆదోని ప్రభుత్వాస్పత్రిలోని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో పూలమాల, శాలువాతో సన్మానం చేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడారు. ఆదోని ప్రాంతంలో అందరితో కలివిడిగా ఉంటూ బాల మురళీకృష్ణ వైద్యులుగా సేవలు అందించారని తెలిపారు. ప్రమోషన్‌పై ఆయన శ్రీకాకుళం జిల్లాకు డిఎంహెచ్‌ఒగా వెళ్తారని చెప్పారు. వైద్య ఉద్యోగులు షెకున్ భాను, బాబురాజు, స్వరూప్ కుమార్, సుబ్బమ్మ ఉన్నారు.

సారూ.. రోడ్లు వేయించండి...


- కమిషనర్‌కు కౌన్సిలర్ వినతి

ప్రజాశక్తి - ఆదోని

చిన్నపాటి వర్షం వచ్చినా కాలనీ అంతా నీటితో తడిచి విధులు బురదమయం అవుతున్నాయని, రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం కల్పించాలని 5వ వార్డు కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి కోరారు. 5వ వార్డులోని కృష్ణానగర్ వాసులతో కలిసి మంగళవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని రామజల రోడ్డు జ్యోతిర్మయి కళాశాల వెనుక మసీదు సమీపంలో కొన్నేళ్లుగా నివాసాలు ఉంటున్నారని తెలిపారు. ఆ ప్రాంతాన్ని కృష్ణా నగర్ అని స్థానికులు పిలుచుకుంటున్నారన్నారు. అక్కడ సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ముందే నిలిచి ఉంటుందని తెలిపారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇటీవల తనవంతుగా ప్రొక్లెయిన్‌తో కచ్చా కాలువలు తవ్వించామని తెలిపారు. కమిషనర్ కృష్ణ స్పందిస్తూ... ఇంజినీరింగ్ సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపి అంచనా సిద్ధం చేసి పనుల మంజూరు కోసం వచ్చే కౌన్సిల్‌లో అంశాన్ని చేరుస్తామని హామీ ఇచ్చారు. కృష్ణ, సొహైల్, దావుద్ ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - చిప్పగిరి



2024 సంవత్సరానికి ముగింపు పలుకుతూ 2025 సంవత్సరానికి స్వాగతం పలికే నేపథ్యంలో ముఖ్యంగా యువత కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త సంవత్సరం వస్తోందని యువత పార్టీల పేరుతో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడపడం మంచిది కాదన్నారు. కుటుంబాలను అనాథలుగా చేయడం మంచిది కాదని తెలిపారు. మనపై ఆధారపడే వారు ఉన్నారని తెలుసుకోవాలని యువకులను కోరారు. మనకు ఏదైనా జరిగితే కుటుంబ సభ్యులు ఎంత అల్లాడుతారో ఒకసారి ఆలోచించాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కన్నడ భాషాభివృద్ధికి కృషి చేయాలి

- ప్రధానోపాధ్యాయులు సిద్ధలింగ

ప్రజాశక్తి - హాలహర్వి

కన్నడ భాషాభివృద్ధికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు వై.సిద్ధలింగ తెలిపారు. మంగళవారం హోసళ్లి మండల పరిషత్ కన్నడ ప్రాథమిక పాఠశాలలో 'శాలెగొందు కన్నడ కార్యక్రమం' నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వై.సిద్ధలింగ అధ్యక్షత వహించారు. 'రాష్ట్రకవి కువెంపు' గురించి ప్రధానోపాధ్యాయులు జ్యోతి మాట్లాడారు. ముఖ్య అతిథులుగా ప్రధానోపాధ్యాయులు తిప్పేస్వామి, విశ్రాంత ఎంఇఒ డి.హిరేహాల్, వై.ముత్తన్న సేవా సమితి అధ్యక్షులు జె.పడదయ్యస్వామి, పాఠశాల గురువులు జి.గౌరమ్మ, టి.వన్నూరమ్మ, సేవా సమితి కార్యదర్శులు బి.గిడ్డయ్య హాజరయ్యారు.

సైన్స్ లేనిదే జీవితం లేదు

- ఎంఇఒ ఈరన్న

- మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - హాలహర్వి

మనిషి జీవితంలో ప్రతి మెట్టులోనూ సైన్స్ ఎంతో ఉపయోగకరంగా మారిందని, సైన్స్ లేనిదే జీవితం లేదని ఎంఇఒ ఈరన్న తెలిపారు. మంగళవారం హాలహర్వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు ఎంఇఒ హాజరయి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలోచనలకు పదునుపెట్టి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రదర్శనలో మండలం నుంచి వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందవరం : విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఎంఇఒ రఘునాథ్ విద్యార్థులకు సూచించారు. నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని నందవరం, ముగతి, నాగలదిన్నె, కనకవీడు, కెజిబివి ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు తక్కువ ఖర్చుతో తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో నుంచి 3 ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. విద్యార్థుల వ్యక్తిగత విభాగానికి సంబంధించి నందవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన గాలి, పొగ శుభ్రం చేసే విధానం, గ్రూపు ప్రాజెక్టు సంబంధించి ముగతి ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన పవన విద్యుత్, ఉపాధ్యాయ కేటగిరి కింద నాగలదిన్నె ఉన్నత పాఠశాల నుంచి ఎంపిక చేశారు. మండల స్థాయిలో ఎంపికైన సైన్స్ నమూనాలను ఈనెల 3న జిల్లా స్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించాలని ఎంఇఒ రఘునాథ్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాం, వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈరన్న, శ్రీనివాసులు, కె.ఎల్లప్ప, సత్యన్న, జయన్న, జె.ఎల్లప్ప, సూర్యనారాయణ, కేశవయ్య, గురుప్రసాద్, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి, కృష్ణారెడ్డి, సిఆర్‌ఎంటిలు మహేశ్వరి, ఉరుకుందు పాల్గొన్నారు. **మంత్రాలయం :** విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుందని ఎంఇఒ రాఘన్న తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ప్రతిభను చాటిన మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తుంగభద్ర, ఖగ్గల్లు, సుంకేశ్వరి, రచ్చమర్రి, చిలకలడోణ, వగరూరు, సూగూరు, చెట్నిహళ్లి గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులు, కెజిబివితో పాటు స్థానిక శ్రీవైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. ఆటోమేటిక్ వాటర్ డిస్పెన్సర్‌ను తయారు చేసిన శ్రీవైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు రామ్ చరణ్, నరసింహులుకు మొదటి బహుమతి, తుంగభద్ర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్, తరుణ్, అశోక్ తయారు చేసిన వాటర్ కంట్రోలర్ ఇన్ అగ్రికల్చర్‌కు ద్వితీయ బహుమతి, రెయిన్ డిసాస్టర్‌ను తయారు చేసిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అశోక్, ఇమ్రాన్‌కు తృతీయ బహుమతి లభించింది. ఎంతో ఉత్సాహంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో వర్కింగ్ మోడల్ రోబో విశేషంగా ఆకట్టుకుంది. సైన్స్ ఉపాధ్యాయులు గోరంట్ల, చంద్రశేఖర్, విఠోభరావు, సౌమ్య, రామకృష్ణ, శంకర్, ఈశ్వర్ రెడ్డి, రాముడు, శ్రీనివాసులు ఆశాలత, ప్రసన్న కుమారి, వరలక్ష్మి, సోనా, లక్ష్మీదేవి, అరుణ కుమారి పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను సైన్స్ ఉపాధ్యాయులు అమనుల్లా బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ మణిమంజరి, ఎంఇఒ-2 నీలకంఠ, హైస్కూల్ ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. సైన్సు ఎగ్జిబిషన్‌కు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వారి గైడ్ టీచర్లు పాల్గొని 129 నమూనాలను ప్రదర్శించారు. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 6 నమూనాలను ఈనెల 3న నిర్వహించే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేశారు. వీటిలో 'స్ట్రక్చర్ ఆన్ బేస్ ఐసోలేషన్' అనే అంశంపై టీచర్స్ విభాగంలో జడ్‌పి హైస్కూల్ మొదటి స్థానం, 'కన్‌స్ట్రక్షన్ ఆఫ్ త్రీడి షేప్స్' అనే అంశంపై జీనియస్ గ్లోబల్ స్కూల్ రెండో స్థానం, 'హైవే హైబ్రిడ్ రెన్యువబుల్ సిస్టం' అనే అంశంపై గ్రూపు కేటగిరిలో గంజిహళ్లి జడ్‌పి హైస్కూల్ మూడో స్థానంలో నిలిచాయి. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎంఇఒ-2 నీలకంఠ సొంత ఖర్చుతో మెమెంటో, బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు తిమ్మన్న, తాజుద్దీన్, గుమ్మల బాబు, అబ్దుల్ సలీం పాల్గొన్నారు. **కౌతాళం** జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆయా ఉన్నత పాఠశాల విద్యార్థులు పోటాపోటీగా నమూనాలను ప్రదర్శించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, సర్పంచి పాల్ దినకరన్, ఎంఇఒలు రామాంజనేయులు, శోభారాణి, ఉపాధ్యాయులు సుధాకర్ ప్రారంభించారు. మండలంలోని 16 ఉన్నత పాఠశాలలు, మూడు యుపి పాఠశాలలకు చెందిన విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన చేశారు. వివిధ రంగాల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించిన వారికి బహుమతులను అందజేశారు. లక్ష్మణాచారి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, రాజానందు, సోమన్న రాజబాబు పాల్గొన్నారు.



హాలహర్విలో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంఇఒ



నందవరంలో...





గోనెగండ్లలో నమూనాను వివరిస్తున్న గంజిహాళ్లి విద్యార్థులు



మంత్రాలయంలో...

కౌతాళంలో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న నాయకులు

రెవెన్యూ సదస్సుకు 9 అర్జీలు

- తహశీల్దార్ శివశంకర్ నాయక్


ప్రజాశక్తి - ఆస్పరి



ఆస్పరిలో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ శివ శంకర్ నాయక్

మండలంలోని చిరుమాన్ దొడ్డి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు తొమ్మిది అర్జీలు వచ్చాయని తహశీల్దార్ శివ శంకర్ నాయక్ తెలిపారు. మంగళవారం భూ సమస్యలను పరిష్కరించడానికి చిరుమాన్ దొడ్డి సచివాలయంలో రెవెన్యూ సదస్సు విఆర్ఒ మాబుసుభాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జీ ఆర్ఐ రంగస్వామి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజినేయులు, సిబ్బంది హరి బాబు, రైతులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి : గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీసర్వేలో భాగంగా రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, పరిష్కారం చేయాలనే అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని, ఈ రెవెన్యూ సదస్సు ద్వారా రైతులకు ఒరిగేదేమీ లేదని నాయకులు మునిస్వామి మండిపడ్డారు. గతంలో ఆన్‌లైన్‌లో భూమి ఎంత ఉంటే అంతే చూపించాలని అధికారులను కోరారు. లేకపోతే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రంగనాథ్, తేజ, రవి, మల్లికార్జున, నాగేంద్ర పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం కుప్పగల్లు గ్రామంలో 18 మంది రైతులకు చెందిన సుమారు 60 ఎకరాల భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించి రైల్వే భూములుగా చూపడం వల్ల తాము నష్టపోతున్నామని, తమ పేర్లు ఆన్‌లైన్‌లో చేర్చాలని కుప్పగల్లు గ్రామ రైతులు కోరారు. గత 100 సంవత్సరాలుగా తమ పెద్దలు సాగు చేస్తూ వస్తున్న భూములను రీసర్వే సందర్భంగా రైల్వే భూములుగా ఆన్‌లైన్‌లో చేర్చడం అన్యాయమని వాపోయారు. అనంతరం తహశీల్దార్ శివ రాముడుకు వినతిపత్రం అందజేశారు. రైతుల పొలాలను తహశీల్దార్ పరిశీలించారు. రైతులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వ్యకాస, రైతుసంఘం నాయకులు లింగన్న, శేఖర్‌లు రైతులకు మద్దతుగా నిలిచారు.




ఆదోనిలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పోలీసు యాక్ట్‌ను అతిక్రమించవద్దు

- డీఎస్పీ సోమన్న

ప్రజాశక్తి - ఆదోని



ఆదోనిలో పోలీసు 30 యాక్ట్ అమలులో ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఆదోని డీఎస్పీ సోమన్న హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎక్సైజ్ అధికారులు సూచించిన సమయం వరకే మద్యం షాపులు తెరిచి ఉంచాలన్నారు. మద్యం తాగి కేకలు వేస్తే చర్యలు ఉంటాయన్నారు. రోడ్లపై కేక్ కటింగ్ చేయడం, డిజెలు, డ్యాన్సులు వేయడం వంటివి చేయరాదని తెలిపారు. పోలీసు నిబంధనలు అతిక్రమిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కోరారు.